IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# హైదరాబాదు రాజ్య విమోచన పోరాటంలో దాశరథికృష్ణమాచార్యగారి జైలుజీవితం అనుభవాలు

డా. ఎం. వి. పట్వర్ధన్,
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరు, జిల్లా: మంచిర్యాల, తెలంగాణ

**వ్యాససంగ్రహం:** విలక్షణమైన అభ్యుదయ భావాలు కల పద్యకవి డా. దాశరథి కృష్ణమాచార్య గారు, 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ ' అన్న పద్యపాదం అగ్నిధారగా మారి, ఆనాటి కరడుగట్టిన నియంతృత్వ నిజాం ప్రభుత్వాన్ని నిలువునా దహించివేసింది. తొలి, మలితరాల తెలంగాణా ఉద్యమాలకు కూడా, ప్రచండ నినాదమై, ప్రజ్వరిల్లింది.

"నా గీతావళి యెంతదూరము ప్రయాణంబౌనో యందాక యీ
భూగోళంబున కగ్గి వెట్టెదను, నిప్పుల్ వోసి హేమంతభా
మా గాంధర్వ వివాహమాడెదను, ద్యోమణ్యుష్ణ గోళంబుపై
ప్రాగాకాశ నవారుణాస్త్ర జలధారల్ చల్లి చల్లార్చెదన్"

అన్న పద్యంలో స్వయంగా దాశరథి చెప్పుకున్నట్టు, వారి కలానికీ, గళానికీ వెరపు లేదు. 'పిట్ట కొంచెమైనా, కూత ఘనం' అన్నట్టు బక్క పలుచని శరీరమే అయినా, కొండంత గుండె ధైర్యం గలవాడు. అందుకే "నా నిజాం రాజు జన్మ జన్మల బూజు" అని ధైర్యంగా గర్జించగలిగిన ధీశాలి. దాశరథి కృష్ణమాచార్యను స్మరించుకోవడం అంటే, హైదరాబాదు సంస్థాన విమోచనోద్యమాన్ని స్మరించుకోవడమే అన్నంత , వారి జీవితం నిజాం వ్యతిరేకపోరాటంతో ముడివడిపోయింది. ఈ పోరాటంలో భాగంగా దాశరథి , ఇందూరు జైలులో ఎదుర్కొన్న అనుభవాలను ఈ వ్యాసం వివరిస్తుంది.

**కీలకపదాలు:** హైదరాబాదు విమోచనోద్యమం- నిజాం ప్రభువు- తెలంగాణా- దాశరథికృష్ణమాచార్య - వట్టికోట ఆళ్వారుస్వామి- ఇందూరు కారాగారం- రాజకీయ ఖైదీలు- రజాకార్లు.

**పరిశోధన ముఖ్యోద్దేశ్యం:** "పాటలు పాడితిన్ తెలుగు బాబులు నిద్దుర మేలుకోగ పో
రాటము సేయగా కరకు రాచరికమ్ముమ కూలదోయగా"

అని దాశరథిగారు చెప్పుకున్నారు. కరకురాచరికమ్మ ను కూలదోసే క్రమంలో నిజాంకు వ్యతిరేకంగా జరిగిన హైదరాబాదురాజ్య విమోచన పోరాటంలో దాశరథి గారి జైలు అనుభవాలను పరిశీలించడం ద్వారా, ఆనాటి పోరాట స్వరూపాన్ని , పోరాటవీరులు ఎదుర్కొన్న దారుణ దమనకాండను రేఖామాత్రంగా అంచనా వేయడం, ఈనాడు మనం అనుభవిస్తున్న , ఈ స్వేచ్ఛాస్వాతంత్రాల వెనుకనున్న మన ముందు తరాల వారి త్యాగాలను గుర్తించడం, ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

**పరిశోధన ప్రణాళిక:**

దాశరథి కృష్ణమాచార్యుల వారి రచనలు మరియు ఆ కాలం నాటి వారు రాసిన రచనలను పరిశీలించడం ద్వారా, దాశరథి కృష్ణమాచార్యులు, చేసిన పోరాటాన్ని, అనుభవించిన జైలు జీవితాన్ని ఆవిష్కరించవచ్చునన్నది ప్రణాళిక.

పరిశోధన విధానం: ఈ పరిశోధనాపత్రాన్ని వ్రాయడానికి, విశ్లేషణా విధానం సరిపోతుంది. దానితో పాటు , సమాచారాన్ని చారిత్రిక,రాజకీయ కోణాల్లోనూ , విశ్లేషించాల్సి ఉంటుంది.

ఆనాడు హైదరాబాదురాజ్య విమోచన కోసం రెండు రకాల పోరాటాలు జరిగాయి. కొందరు గాంధేయ మార్గంలో సత్యాగ్రహాలు చేసి, జైళ్ళకు వెళ్ళితే , ఇంకొందరు అతివాద మార్గంలో నడచి, రహస్య జీవితం గడుపుతూ ఆశయం కోసం కృషి చేసేవారు. వీరిలో దాశరథి గారు మొదటి రకానికి చెందుతారు. ఇక్కడ హైదరాబాదు సంస్థాన ప్రత్యేక స్వభావాన్ని గమనించాల్సి ఉంటుంది. బ్రిటిషు వారి ప్రోత్సాహంతో, భారత దేశంలో చేరడానికి నిరాకరించి, స్వతంత్ర దేశంగా ఉంటామని నిజాం హుంకరిస్తున్నాడు. "హైదరాబాదు సంస్థానము భారతదేశంలోని బ్రిటిషు సామ్రాజ్యతత్వపు భారమంతా కేంద్రీకృతమైవున్న గురుత్వ కేంద్రము – బ్రిటిషు ఇండియా నుండి రవాణా అయిన మతావేశపరులతో నింపి, , బ్రిటిషు రాజకీయవేత్తలు, దాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో తీర్చిదిద్దారు. భారత వ్యతిరేక కేంద్రంగా 'హైదరాబాదు సంస్థానాన్ని పెంపొందిస్తే, . మొత్తం భారత దేశపు ఐక్యతకు, స్థిరత్వానికి చేటుకలుగుతుంది అని వారి అంచనా." అన్న స్వామి రామానందతీర్థ గారి మాటలను గమనిస్తే, భారతవ్యతిరేక కేంద్రంగా హైదరాబాదు సంస్థానం రూపొందించే ప్రయత్నం చాలా తీవ్రంగా జరిగిందని, తెలుస్తుంది.

నిజాం తన రాజ్యాన్ని స్వతంత్రంగా ఉంచడం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేసేవాడో "నిజాం దుష్టత్వానికి దిగాడు. పాకిస్తానులో చేర్తానంటాడు. పాకిస్తానుకు ఇరవై కోట్లు ఇస్తాడు. సిడ్నీకాటన్తో దొంగ ఆయుధాలు తెప్పిస్తాడు. యునైటెడ్ నేషన్స్

ఆర్గనైజేషన్ – U.N.O .కు ప్రతినిధులను పంపుతాడు." అన్న దాశరథి రంగాచార్య గారి వాక్యాలు వివరిస్తాయి.

**ఇందూరు జైల్లో దాశరథి ఎదుర్కొన్న ప్రధానమైన అనుభవాలు:**

1) **తెలంగాణా ఉద్యమ నినాదం** "నా తెలంగాణా కోటి రత్నాల వీణ" తెలంగాణా ఉద్యమానికి ఉపశీర్షికగా పేర్కొన దగిన ఈ నినాదం ఇందూరు జైలులో నుండి తెలంగాణా అంతా అగ్నిధారలా ప్రవహించింది. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొంటూ, ప్రజలను చైతన్యపరుస్తూ ఉండడంతో, నాటి సర్కారు దాశరథిగారినీ, తనతో పాటు ఒక 150 మందిని అరెస్టు చేసింది. అయినా దాశరథి ఆ కారాగారాన్నే తన ప్రబోధానికి వేదికగా చేసుకున్నారు. పద్య లూ, పాటల ద్వారా తోటి ఖైదీలను ఉత్సాహపరుస్తూ, వారిలో పోరాటస్ఫూర్తి మరింత రగిల్చేవారు. ఈ క్రమంలోనే దాశరథి గారు జైలుగోడ మీద మసిబొగ్గుతో

"ఓ నిజము పిశాచమా! కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్న డేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు

నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అన్న పద్య నినాదాన్ని రాసారు. ఈ పద్య నినాదం వట్టికోట ఆళ్వారుస్వామి గారు కంఠస్థం చేసి, తరచూ చదువుతూ ఉండేవారు. జైలు అధికారులు గోడ మీద ఉన్న ఈ పద్యాన్ని చెరిపినప్పుడల్లా, మరోచోట, మరోగోడ మీదతిరిగి ప్రత్యక్ష మయ్యేది. అందరూ దాశరథిగారే రాస్తున్నారని అనుకున్నప్పటికీ, అదివట్టికోట ఆళ్వారు స్వామిగారి పని అని, ఆ తరువాత తెలిసింది. వట్టికోటఆళ్వారు స్వామిగారితో కలిసి గడిపిన ఈ సమయం దాశరథి జీవితంలో మరపురానిది. అందుకే తన అగ్నిధారను వారికే అంకితం ఇచ్చారు.

2) **దాశరథిగారి నిర్బంధం - ఇక్బాల్ కవిత**: దాశరథి గారికి ఇక్బాల్ అభిమాన కవి. గూడురులో దాశరథిని నిర్ బంధించినప్పుడు బావర్చీని మచ్చిక చేసుకొని,

"ఏ పొలమున నిరుపేదకు దొరకదో తిండి దొరకదో, ఆ పొలమున గల పంటను కాల్చేయండి" అన్న ఇక్బాల్ కవితనే పాడుకుంటూ తప్పించుకున్నారు. ఆ విప్లవ ఝుంఝూమారుతంలో ఇక్బాల్ కవిత నాకు వజ్రాయుధంలా తోడుపడింది" అంటారు దాశరథిగారు.

3) **దాశరథిగారి దృఢదీక్ష- నిర్భయత్వం:** నిజాం జైళ్లలో రాజకీయఖైదీలను చాలా హింసించేవారు. దాశరథిగారు ప్రాణాలకు తెగించి నిజాం వ్యతిరేకపోరాటంలోకి దూకారు.వరంగల్ సెంట్రల్ జైలు నుండి తరలించేటప్పుడు "జంగారెడ్డీ! మనం
బతకడానికి కాదు గదా, ఈ ఉద్యమంలో దూకింది? నీకు ఇంటికి వెళ్ళే ఆశ లేదు కదా!అయినప్పుడు చద్దాం.. భారతమాట పాదాలకు మన రక్తపద్మాలతో ఈరాత్రి పూజ. పదిమందితో చావు పెండ్లితో సమానం: అన్న మాటలు వారి ధృఢదీక్షను తెలియజేస్తున్నాయి.

4) **నాజీజైళ్ళను మించిన నిజాం జైళ్ళు**:: రాజకీయ ఖైదీలకు నిజాం జైళ్లలో చాలా దుర్భరపరిస్థితులెదురయ్యేవి రొట్టెలలో సిమెంటు కలిపి కాల్చి,ఇచ్చే వారు. ఇవి తిని జీర్ణం కాక ఎందరో మరణించేవారు. వారానికి ఒకరోజు వరి అన్నం పెట్టేవారు. అయితే అందులోనూ కావాలని వడ్లగింజలు కలిపేవారు. వడ్ల గింజలను ఏరుకోగా నాలుగుముద్దలైనా అన్నం మిగలక పొయ్యేది.ఏడు వందల మందికి పైగా రాజకీయఖైదీలకు కలిపి ఒక్కటే, నీళ్ళ పంపుండేది.అక్కడే స్నానాలూ, బట్టలుతుక్కోవడాలూ, మొదలైన అన్ని పనులూచేసుకోవాలి. జైలు బయట జరుగుతున్న విషయాలను క్షురకుడు పొట్లంలో పెట్టుకొని, తెచ్చేకాగితాలూ, కరపత్రాల ద్వారా తెలుసుకునేవారు. చివరికి ఆక్షురకుడు పట్టుబడ్డాడు. రాజకీయఖైదీలను రజాకారులూ , పోలీసులూవిచక్షణారహితంగా చితకబాదేవారు. స్వాతంత్ర్యం కోసం పోరాడే వారికిహంతకులకు ఇచ్చే దుస్తులను ఇచ్చేవారు. జైలులో సరైన వైద్య సౌకర్యం ఉండేది కాదు. మొత్తం జైలుకు ఒక్కడే దాకతారు ఉండేవాడు.ఖైదీలను నగ్నంగా పరీక్షించేవాడు. ఇట్లాంటి దుర్భర పరిస్థితులున్నాయి కాబట్టే. నిజాం జైళ్ళు, నాజీ జైళ్ళను మించి ఉన్నాయ దాశరథిగారు వ్యాఖ్యానించారు. .

5) **జైళ్ళుగా మారిన దేవాలయాలు**: నిజామాబాదులో ఉన్నశ్రీరామ దేవాలయాన్నే జైలుగా మార్చారు. . దీనిన గూర్చి "ఒక కాలంబున, ఇద్దిదేవళము, వేరొక్కప్డు దుర్గంబు నేడకటా! జైలయి కానుపించెను, భవిష్యత్ కాలమందెట్టి రూపకమున్ దాల్చునో?" అని పద్యరూపంగా వాపోతారు దాశరథిగారు.

6) **మృత్యువును సైతం లెక్క చేయని దాశరథిగారి ధైర్యం**: జైల్లోఉన్నప్పుడు దాశరథికి విపరీతమైన జ్వరం వచ్చింది. తిండి లేకా, , సరైన చికిత్స లేక, రక్త విరేచనాలు మొదలైనాయి. క్షమాపణ చెపితే ఇంటికి పోవచ్చునని తోటి ఖైదీలు చెప్పినా వినక, ఆత్మీయులు తెప్పించిన క్షమాపణ పత్రాలపై, శివుడి మీద స్తుతి గీతాలు రాసుకున్న ధైర్యశాలి దాశరథిగారు. అందుకే "కారాగారము మృతి కౌగిలి కామించెడి వీరవరులు కలరిచ్చోటన్" అని అనగలిగారు.

7) **జైల్లో ఉన్న రాజకీయఖైదీలపై రజాకార్ల భౌతికదాడి**: జైల్లోకూచోని పుక్యానికి తింటున్నారన్న అక్కసుతో డిచ్పల్లిలో ఉన్నన రజాకారుగూండాలు జైల్లో ఉన్న రాజకీయ ఖైదీలపై జనవరి 11,1948 నాటి రాత్రిసమయంలో దాడిచేసారు. దీన్ని జైలు అధికారులెవరూ వారించలేదు. ఈ దాడిలో దాశరథిగారు కూడా తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్ళిపోయారు. ఆనాటి హైదరాబాదురాజ్యంలోని అన్ని జైళ్ళలోనూ ఇదేవిధంగాదాడి జరిగింది. . నాటి జైళ్ళలో రాజకీయ ఖైదీలకు ఎలాంటి భద్రతా ఉండేది కాదన్న విషయాన్ని

"Satyagrahis in Nizamabad jail have been belabored and untold sufferings
have been inflicted on them…In Gulbarga jail itself, in my immediate vicinity a
satyagrahi was beaten to death"

అన్న స్వామి రామానందతీర్థ గారి మాటలు ఆనాటి భయానక స్థితిగతులను, స్పష్టం చేస్తున్నాయి.

మొత్తం మీద చూస్తే దాశరథిగారి జైలుజీవితం చాలా ధీరోదాత్తంగా గడిచింది. ఆరోగ్యం సహకరించకున్నా , తన మీద భౌతికదాడులు జరిగినా చలించలేదు. క్షమాపణ చెప్పి , జైలునుండి విడుదలయ్యే అవకాశం ఉన్నా, తృణీకరించారు.

పోలీసులనుండి తప్పించుకని పారిపోయ్యే అవకాశం ఉన్నా, నిజాయితిగా ఆ అవకాశాన్ని కాలదన్నుకున్నారు. జైలుజీవితం దుర్భరమే అయినా కవిత్వ సృజనతో తమను తాము సమాశ్వాసించుకున్నారు.

" నీళ్ళ లో నిప్పు మాదిరి - నిప్పులోన నీళ్ళ మాదిరి
కష్టాల నీడలందు సుఖము వసించునంట!
ఉస్సురను వేడి – ఊర్పు లోన పరీమళాలున్న వంట"

అని ఇందూరు జైలులో రాసుకున్నట్టు విషాదాల్లోనే, వినోదాన్ని కూడా వెదుక్కున్నారు. తమ కవిత్వంలో అంగారం, శృంగారం రెండూ ఉంటాయన్న దానికి నిదర్శనంగా వరంగల్ సెంట్రల్ జైలునుండి ఇందూరుజైలుకు మారుస్తూనప్పుడు, అంత తీవ్ర నిర్బంధంలో కూడా

"చలిగాలి పలుకు వార్తలు - చెలిగాలిని బోలి వలపు చిరు వెచ్చదన-
మ్ములు గుండెలలో నిండెను – చెలికాడా! జైలు బయట చిత్తమ్మలరన్"

అని శృంగారరసస్ఫోరకంగా చెప్పగలగడం వారికి మాత్రమే చెల్లింది. పోరాటం నుండి కళ పుడుతుందని బలంగా నమ్మారు. నిజానికి దాశరథిగారి జీవితమే ఒక అలుపెరుగని పోరాటం. నిత్యం తిమిరంతో సమరం, . స్వాతంత్ర్యయోధులుగా, అత్యంత ప్రతిభావంతులైన అగ్రశ్రేణి తెలుగు కవిగా దాశరథి స్థానం అనన్య సామాన్యం.

"ఇది నిదాఘము ఇందు సహింపరాని
వేడి ఏడ్పించుచున్నది పాడువడిన
గోడలందున జైలులో పాడినాడ
వాడిపోనున్న పూమొగ్గపైని పాట"

అని తమ జైలు జీవితాన్ని ,పరిస్థితిని అభివర్ణిస్తారు దాశరథిగారు. అక్కడి జైలులో వసంతం లేదు. అక్కడసహింపరాని గ్రీష్మ హేమంత కాలనాళికలె తప్ప, మరేమీ లేని, పరిస్థితిని వివరిస్తాడు.

"నేడు తెలంగాణాలో కవులెందరో యున్నారు, కాని పీడిత ప్రజల సమస్యలకు
పెద్దపీట వేసి, , గొంతెత్తి చెప్ప గల్గిన కవి వాణి దాశరథియే! జన సామామాన్యము యొక్క
హృదయాలలోని ఆకాంక్షలను గట్టిగా
శక్తిమంతంగా వ్యక్తీకరించిన ఆంధ్రావని యువకుడు మరొక్కడు లేడని చెప్పిన అతిశయోక్తి
కాజాలదు, దౌర్జన్యము , అన్యాయము, అక్రమముల మీద తిరుగుబాటే ఒక మాటలో దాశరథి
కవిత్వము"

అన్న దేవులపల్లిరామానుజ రావు గారి మాటలు అక్షరసత్యాలు! ఇవ్వాళ మనం ప్రత్యేక తెలంగాణారాష్ట్రంలో స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే దాశరథి లాంటి ఎందరో పోరాటవీరుల త్యాగాలే కారణం. ఇందూరు జైల్లో ఉన్నప్పుడు దాశరథి మన;స్థితి ఎలా ఉండేదో, అక్కడి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉండేదో, ఈ క్రింది పద్యాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

"వెన్నెలలు లేవు, పున్నమికన్నె లేదు,
వేడి వన్నెల నెలవంక జాడ లేదు
చుక్కలే లేవు ఆకాశశోకవీధి
ధూమధామమ్ము; దు:ఖ సంగ్రామభూమి"

అయితే, దాశరథి వంటి వారి త్యాగాలు,పడ్డ కష్టాలు వృథా పోలేదు. హైదరాబాదు సంస్థానంపై పోలీసు చర్య జరిగింది. నిజాం నియంతృత్వ పాలన ముగిసింది. ఈ శుభసమయాన్ని దాశరథి గారు ఇలా వర్ణిస్తారు. "మేమంతా జైళ్ళు ఖాళీ చేసి,బోలారం వైపు వెళ్ళాము. భారత సైనిక దళాలు కవాతు చేస్తూ, వేల సంఖ్యలో వస్తున్నై.ట్యాంకుల గర్జనలు విజయసింహ గర్జనల్లావున్నాయి. త్రివర్ణ పతాకాలు,జయజయధ్వానాలు, ముద్దబంతిపూల దండలు సైనికుల మేడల్లో వేయడానికి వేల జనం తెచ్చారు. మేం జైళ్ళ నుంచి వచ్చామని తెలిసి ,మా మెడల్లో వేసారు.ఆనందానికి అవధులు లేవు".

**ముగింపు:** దాశరథి గారి జైలు అనుభవాలను మనం ఈ విధంగా క్రోడీకరించవచ్చు.

1. జైలు జీవితం, నిత్యం ఒక్కో రోజు, ఒక్కో నరకంలాగా ఉన్నా, దాశరథి, తమ జైలు జీవితాన్ని కూడా, ఎలాంటి వెలితిపడకుండా,వెనుకంజ వేయకుండా, ధైర్యసాహసాలతో, అనుభవించారు.

2. క్షమాపణలు చెప్పి, తప్పించుకునే అవకాశం ఉన్నా, దాశరథి గారు ఏమాత్రం రాజీపడలేదు.

3. జైలు జీవితంలోనూ, కవిత్వసృజనకున్న ఏ యొక్క అవకాశాన్నీ వదలలేదు.

**ఉపయుక్త గ్రంథాలు**:

1. కృష్ణమాచార్య దాశరథి, యాత్రా స్మృతి, తెలుగు సమితి, ఎమెస్కో బుక్ ట్రస్ట్
2. ప్రచురణలు, హైదరాబాదు, 2011
3. కృష్ణమాచార్య దాశరథి, దాశరథి సాహిత్యం-1, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ ప్రచురణలు, హైదరాబాదు, 2011
4. కృష్ణమాచార్య దాశరథి, దాశరథి సాహిత్యం- 2, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ ప్రచురణలు,హైదరాబాదు, 2011
5. కృష్ణమాచార్య దాశరథి- అగ్నిధార, సాహితీమేఖల ప్రచురణలు, హైదరాబాదు, 1949
6. కృష్ణమాచార్య దాశరథి- ఆలోచనాలోచనాలు, మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు , 1975
7. రంగాచార్య దాశరథి, జీవన యానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ ప్రచురణలు,హైదరాబాదు, ఆగస్టు,1999
8. హరి ,ఆదిశేషువు, (ఆంగ్ల మూలం: స్వామి రామానంద తీర్థ) , హైదరాబాదు స్వాతంత్ర్య పోరాటము- అనుభవాలు,జ్ఞాపకాలు